26న ఎబిఎస్‌వికె ఆధ్వర్యాన ప్రత్యేక వైద్య శిబిరం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

పట్టణంలోని మెంటేవారితోటలోని సుందరయ్య భవనంలో ఈ నెల 26వ తేదీ ఆదివారం ఉదయం నుండి మధ్యాహ్నం వరకు పక్షవాతం, ఫిట్స్, బిపి, షుగర్ వ్యాధిగ్రస్తులకు వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు వసుధ ఫౌండేషన్ కన్వీనర్ ఇందుకూరి ప్రసాదరాజు తెలిపారు. అల్లూరి సీతారామరాజు, భగత్‌సింగ్ వైద్య సహాయ కేంద్రంలో విజయవాడకు చెందిన న్యూరో ఫిజీషియన్ డాక్టర్ గోపాలం శివన్నారాయణ, వైద్యులు డి.సందీప్‌వర్మ, జి.పద్మజ, జి.సత్యనారాయణరాజు తదితరులు పాల్గొని వైద్య సేవలు అందిస్తారన్నారు. తక్కువ ధరలకే అవసరమైన ఔషధాలను నెలలవారీగా అందిస్తారన్నారు. శిబిరానికి వచ్చేవారు ఒక రోజు ముందే షుగర్ పరీక్ష, రక్తపోటు చూపించుకుని రిపోర్టులతో రావాలన్నారు. చేయించుకోలేనివారికి బిపి, షుగర్ పరీక్షలు వైద్య శిబిరంలో ఉచితంగా చేస్తారన్నారు. ఈ అవకాశాన్ని రోగులు వినియోగించుకోవాలని కోరారు.

కౌంటింగ్.. కౌంట్‌డౌన్..!

- మరో పది రోజుల్లో ఓట్ల లెక్కింపు
- పటిష్ట ఏర్పాట్లపై అధికారుల ముమ్మర కసరత్తు
- నియోజకవర్గానికి 14 టేబుళ్ల ఏర్పాటుకు ప్రణాళికలు
- భారీ బందోబస్తు ఏర్పాట్లకు సన్నాహాలు
- బాణసంచా, బల్క్ పెట్రోల్, డీజిల్ అమ్మకాలపై నిషేధాజ్ఞలు
- అనుమానిత ప్రాంతాల్లో ముమ్మర తనిఖీలు
- అల్లర్ల అదుపునకు ముందుగా మాక్‌డ్రిల్

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

సాధారణ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సమయం దగ్గరపడుతోంది. మరో పది రోజుల్లో అంటే జూన్ నాలుగో తేదీన ఓట్ల లెక్కింపు ప్రక్రియ జరగనుంది. రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో నెలకొన్న ఘర్షణలు, అల్లర్లు నేపథ్యంలో అధికారులు ఓట్ల లెక్కింపు రోజు పటిష్ట ఏర్పాట్లు చేసేందుకు తీవ్ర కసరత్తు చేస్తున్నారు. ప్రశాంత వాతావరణంలో లెక్కింపు ప్రక్రియ జరిగేలా అన్ని ఏర్పాట్లూ చేస్తున్నారు. రెండు జిల్లాల్లో 14 అసెంబ్లీ, రెండు పార్లమెంట్ స్థానాలు ఉన్నాయి. ఏలూరు జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు, ఒక ఎంపీ స్థానానికి సంబంధించి ఓట్ల లెక్కింపు ప్రక్రియ సిఆర్‌ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో, పశ్చిమగోదావరి జిల్లాలోని ఏడు నియోజకవర్గాలు, ఒక ఎంపీ స్థానానికి సంబంధించి ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఎస్‌ఆర్‌కెఆర్, విష్ణు కాలేజీల్లో జరగనుంది. నియోజకవర్గానికి 14 టేబుళ్ల ఏర్పాటు చేసే విధంగా అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఫలితాలు త్వరితగతిన వెల్లడించేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. నియోజకవర్గానికి సంబంధించిన ఆర్‌ఒలు స్ట్రాంగ్‌రూములను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ తగిన చర్యలు తీసుకుంటున్నారు. తొలుత పోస్టల్ బ్యాలెట్ ఓట్లు లెక్కింపు ప్రక్రియ చేపట్టనున్నారు. తర్వాత ఇవిఎంల్లోని ఓట్ల లెక్కింపు జరగనుంది. లెక్కింపు రోజు ఎటువంటి ఇబ్బందులూ తలెత్తకుండా ముందుగా రాజకీయ పార్టీల నాయకులతో సమావేశాలు నిర్వహించి కౌంటింగ్ రోజు ఏవిధంగా నడుచుకోవాలో తెలియజేస్తున్నారు. ఏజెంట్ల నియామకానికి సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపైనా సూచనలు చేస్తున్నారు. కౌంటింగ్ ప్రక్రియ దగ్గర పడుతుండటంతో ముందస్తు జాగ్రత్తలపై పోలీస్ యంత్రాంగం సైతం ప్రత్యేక దృష్టి సారించింది. కౌంటింగ్ కేంద్రాల వద్ద, వివిధ ప్రాంతాల్లో భారీ బందోబస్తు ఏర్పాట్లు చేసేందుకు ప్రణాళికలు రూపొందించుకుంటున్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో ముందస్తు తనిఖీలు నిర్వహించి పరిస్థితిని అదుపులోకి తీసుకుంటున్నారు. అల్లర్లు జరిగితే ఎలా ఎదుర్కోవాలనే దానిపై ముందుగానే మాక్‌డ్రిల్ నిర్వహించి సిబ్బందిని సమాయత్తం చేస్తున్నారు.

నిషేధాజ్ఞలు అమలు

రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఎన్నికల రోజు, తర్వాత జరిగిన ఘర్షణల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ పలు ఆంక్షలు విధించింది. బాణాసంచా అమ్మకాలు, కొనుగోలుపై నిషేధం పెట్టింది. బాటిల్స్, టిన్నుల్లో డీజిల్, పెట్రోల్ అమ్మకాలపై నిషేధం విధించింది. డీజిల్, పెట్రోల్ అమ్మకాలపై నిషేధాజ్ఞలతో జిల్లాలోని ఆక్వారైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వేసవి కావడంతో విద్యుత్ కోతలు ఎక్కువగా ఉంటున్నాయి. ఆక్వా చెరువుల్లో ఏరియేటర్స్ తిప్పాలంటే మోటార్లు అవసరం, మోటార్లు తిరిగేందుకు డీజిల్ అత్యవసరం కావడంతో ఆక్వారైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏలూరు జిల్లాలోని దెందులూరు నియోజకవర్గంలో ఎన్నికల రోజు చెదురుమదురు ఘటనలు చోటుచేసుకున్నాయి. దీంతో ఆ నియోజకవర్గంపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. 144 సెక్షన్ అమల్లో ఉండటంతో జనం గుమిగూడదనే ఆంక్షలు కొనసాగుతున్నాయి. గెలుపోటములపై జిల్లాలో బెట్టింగులు జోరు పెద్దఎత్తున కొనసాగుతోంది. దీంతో ఓట్ల లెక్కింపుపై సర్వత్రా ఉత్కంఠ కొనసాగుతోంది.

నేడే డివైఇఒల నియామక పరీక్ష

హాజరు కానున్న 320 మంది అభ్యర్థులు
పరీక్షా కేంద్రాల 144 సెక్షన్
డిఆర్ఒ డి.పుష్పమణి

ప్రజాశక్తి - ఏలూరు

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్స్ నియామక పరీక్షను సంబంధిత అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి, జిల్లా పరీక్షా సమన్వయ అధికారి డి.పుష్పామణి తెలిపారు. శుక్రవారం డిఆర్ఒ తన ఛాంబర్‌లో ఈ నెల 25న జరగనున్న ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ డిప్యూటీ ఎడ్యుకేషన్ ఆఫీసర్స్ పరీక్ష నిర్వహణకు సంబంధించిన అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పుష్పమణి మాట్లాడుతూ ఏలూరులో రెండు పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సిద్ధార్థ క్వెస్ట్ సిబిఎస్ఇ స్కూల్, ఏలూరు ఇంజినీరింగ్ టెక్నాలజీ కళాశాలలోను పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. పరీక్షలకు 320 మంది అభ్యర్థులు హాజరవుతారన్నారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులను ఉదయం 7.30 గంటల నుండి అనుమతిస్తారని, 8.30 గంటల తర్వాత అనుమతి లేదని స్పష్టం చేశారు. ఆర్‌టిసి బస్సులు అభ్యర్థులకు అనువుగా ఉండేలా ఏర్పాట్లు చూడాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని తెలిపారు. ఎపి పబ్లిక్ సర్వీస్ కమిషన్ తరపున అసిస్టెంట్ సెక్రటరీ ఎ.కృష్ణవేణి (మోనిటర్), అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ ఎన్.కస్తూరిని పరీక్ష నిర్వహణ అధికారులుగా నియమించినట్లు తెలిపారు. పరీక్షలు సక్రమ నిర్వహణకు సంబంధిత అధికారులు సమన్వయంతో పని చేయాలని కోరారు.

మొక్కలతో వాతావరణ సమతుల్యం

నగరంలో 400 మామిడి, నేరేడు, జామ తదితర మొక్కలు నాటేందుకు శ్రీకారం
కుటుంబ సమేతంగా మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు


మొక్కలు నాటుతున్న కలెక్టర్ దంపతులు

పర్యావరణ సమతుల్యానికి, ఆరోగ్యకరమైన వాతావరణానికి మొక్కలు నాటడం ఎంతో దోహద పడుతుందని కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ అన్నారు. శుక్రవారం నగరంలో పలు ప్రాంతాల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. నగరంలోని తంగెళ్లమూడి-జంగారెడ్డిగూడెం రోడ్డు, సిఆర్ఆర్ కళాశాల వద్ద, అశోక్ నగర్, పంపుల చెరువు తదితర ప్రాంతాల్లో కలెక్టర్ దంపతులు ప్రసన్న వెంకటేష్, డాక్టర్ మానస తమ పిల్లలతో కలిసి మొక్కలు నాటి అందరికీ స్ఫూర్తిదాయకంగా నిలిచారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వృక్షాలు నగరంలో కేవలం ఆకర్షణీయంగానే కాకుండా పర్యావరణ పరిరక్షణకు గణనీయంగా దోహదపడతాయన్నారు. గాలి నాణ్యతను మెరుగుపరిచేందుకు దోహదపడతాయన్నారు. ఫల రకాల మొక్కలు నాటడం మూలంగా అవి పెరిగిన అనంతరం పక్షులకు ఆహారాన్ని అందించేందుకు దోహదపడతాయన్నారు. ఏలూరు నగరంలో మామిడి, జామ, నేరేడు వంటి ఫల రకాల మొక్కలతోపాటు రావి, తదితర 400 మొక్కలను నాటనున్నట్లు తెలిపారు. ఇందుకయ్యే ఖర్చును తమ కుమారుడు రుద్రాన్ష్ సాయి మణికంఠన్ జన్మదినోత్సవం సందర్భంగా తాము అందిస్తున్నట్లు చెప్పారు. వీటికి ట్రీగార్డులు అమర్చి పెంపకం విషయంపై స్థానిక అధికారుల పర్యవేక్షణ ఉంటుందన్నారు. కలెక్టర్ సతీమణి డాక్టర్ మానస మాట్లాడుతూ వివిధ జీవరాశుల ఆకలి తీర్చేదిశగా పండ్ల మొక్కలను పెంచడం ఆవశ్యమన్నారు. కార్యక్రమంలో డిఆర్ఒ డి.పుష్పమణి, ఏలూరు ఆర్‌డిఒ ఎన్ఎస్‌కె.ఖాజావలీ, నగరపాలక సంస్థ కమిషనర్ ఎస్.వెంకటకృష్ణ, డ్వామా పీడీ ఎ.రాము, డిఎఫ్ఒ శైలజ తదితరులు పాల్గొన్నారు.

పూర్తిస్థాయిలో ఇవిఎంల సంరక్షణ

ఎస్‌పి మేరీ ప్రశాంతి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

రిజిస్టర్‌లో సంతకం చేస్తున్న ఎస్‌పి మేరీప్రశాంతి

ఏలూరు నగరంలో భద్రపరిచిన జిల్లా స్థాయి ఇవిఎంల సంరక్షణ పూర్తి స్థాయిలో చేపడుతున్నామని ఎస్‌పి మేరీ ప్రశాంతి స్పష్టం చేశారు. నగరంలోని సర్‌సిఆర్ రెడ్డి కళాశాల ప్రాంగణంలో భారీ బందోబస్తు నడుమ ఎన్నికలు ముగిసిన అనంతరం ఇవిఎంలను భద్రపరిచారు. ఈ ఇవిఎంలకు మూడంచెల భద్రతను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో ఎస్‌పి మేరీ ప్రశాంతి ఇవిఎంలను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మూడంచెల భద్రత వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎప్పటికప్పుడు నిఘా వ్యవస్థలో వైఫల్యాలు లేకుండా బందోబస్తు కల్పించాలని సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆకస్మికంగా ఏలూరు సిఆర్.రెడ్డి ప్రాంగణాన్ని తనిఖీ చేసినట్లు ఆమె తెలిపారు. నిఘా వ్యవస్థను కట్టుదిట్టం చేశామని చెప్పారు. 24 గంటలూ మూడంచెల భద్రతలో ఇవిఎంలు సురక్షితంగా ఉన్నాయని ఆమె స్పష్టం చేశారు.

దెందులూరు నియోజకవర్గ స్ట్రాంగ్ రూమ్‌ల తనిఖీ

ఏలూరు : దెందులూరు నియోజకవర్గ ఇవిఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద భద్రతను జాయింట్ కలెక్టర్, దెందులూరు రిటర్నింగ్ అధికారి బి.లావణ్య వేణి శుక్రవారం తనిఖీ చేశారు. ఏలూరులోని సర్‌సిఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఇవిఎంల స్ట్రాంగ్ రూంను ఆమె పరిశీలించారు. ఇవిఎంలకు, తలుపులకు వేసిన తాళాలను, తాళాలకు ఉన్న సీళ్లను క్షుణ్ణంగా పరిశీలించారు. అన్ని చోట్లా సీసీ కెమెరాలు పరిశీలించారు. తనిఖీ అనంతరం సందర్శకుల రిజిష్టర్‌లో ఆమె సంతకం చేశారు. ఇవిఎం కంట్రోల్ రూంను పరిశీలించారు.

మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం

జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి


మజ్జిగ పంపిణీ చేస్తున్న జెసి లావణ్యవేణి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చడానికి మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి తెలిపారు. శుక్రవారం స్థానిక రామచంద్రరావుపేటలోని శ్రీ వేంకటేశ్వరస్వామి గుడివద్ద తూర్పుప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఉద్యోగులచే ఏర్పాటు చేసిన ఉచిత మజ్జిగ పంపిణీ కేంద్రాన్ని ఆమె సందర్శించి ప్రజలకు ఉచితంగా మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ మజ్జిగ పంపిణీ చేస్తున్న తూర్పుప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఉద్యోగులను అభినందించారు. ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ పి.సాల్మన్‌రాజు మాట్లాడుతూ ప్రతిరోజూ 150 లీటర్లకుపైగా మజ్జిగను విజయ డెయిరీ ద్వారా కొనుగోలు చేసి ప్రజలకు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏలూరు సర్కిల్ విద్యుత్ ఇఇ ఎం.ఝాన్సీ, ఆపరేషన్ ఇఇ జెపిబి.నటరాజన్, ఎపి ఇపిడిసిఎల్ ఎస్‌సి, ఎస్‌టి అసోసియేషన్ జనరల్ సెక్రటరీ సిహెచ్.సాయిబాబు, రీజనల్ ప్రెసిడెంట్ జివివి.పాల్, ఎస్.బలుసుబాబు, ఎం.రమేష్, పి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

వ్యవసాయం పట్ల విద్యార్థులకు అవగాహన అవసరం

మార్టేరు వ్యవసాయ పరిశోధనా సంస్థ సహాయ సంచాలకులు శ్రీనివాస్

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

మాట్లాడుతున్న వక్తలు

ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం పరిధిలో మార్కాపురం వ్యవసాయ కళాశాలలో వ్యవసాయ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ పనులు పట్ల అవగాహన పెంచుకుని కళాశాలకు మంచి పేరు తేవాలని మార్టేరు వ్యవసాయ పరిశోధనా సంస్థ సహాయ సంచాలకులు డాక్టర్ డి.శ్రీనివాస్ విద్యార్థులకు ఉద్బోధించారు. వ్యవసాయ విద్యార్థులు వ్యవసాయ పనుల పట్ల, రైతులకు అధిక దిగుబడులు అందించే పంటల పట్ల అవగాహన పెంచుకుంటూ వృత్తిలో నైపుణ్యత పెంపొందించుకునేందుకు ప్రభుత్వం వ్యవసాయ కళాశాల విద్యార్థులకు ఏర్పాటు చేసిన రావెప్ ప్రోగ్రామ్‌లను సద్వినియోగం చేసుకుని వ్యవసాయ విద్యలో ఉత్తీర్ణులవ్వాలని కోరారు. గుంటూరు పరిధిలోని ఏరువాక కేంద్ర బృందం ఏలూరు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మార్కాపురం ఎన్ఎస్.వ్యవసాయ కళాశాలకు చెందిన ఏడుగురు విద్యార్థులను పెదవేగి మండలం నడిపల్లి, లింగపాలెం మండలం తోచిలక, రాయుడుపాలెం గ్రామాల్లో గ్రామీణ ప్రాంత రైతులు సాగుచేసే వ్యవసాయ పంటల సాగు పద్ధతుల పట్ల అవగాహన పెంచుకునేందుకు తద్వారా పని అనుభవం పెంపొందించుకునే విధంగా రైతుల పనుల్లో భాగస్వాములను చేసే విధంగా రైతు భరోసా కేంద్రాల వద్ద రైతులను భాగస్వాములను చేసి విద్యార్థులతో రైతు సదస్సులు ఏర్పాటు చేశారు. ఈ సదస్సులో వరి రకాల సాగు, సేంద్రియ ఎరువుల వినియోగం వల్ల పంటల దిగుబడులను వివరించారు. జిల్లా వ్యవసాయాధికారి షేక్ బాషా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు పొలాల్లో ప్రాక్టికల్‌గా కూడా ప్రయోగాలు చేసి వృత్తి పరమైన నైపుణ్యతను సాధించే విధంగా గ్రామీణ ప్రాంతాల్లో జరిగే వ్యవసాయ పంటల సాగులో పనుల మెలకువలు నేరుగా నేర్చుకోవడం ద్వారా భవిష్యత్తులో ఉద్యోగ రీత్యా ఉపయోగం ఉంటుందని తెలిపారు.

కౌంటింగ్ సిబ్బంది తొలి ర్యాండమైజేషన్ పూర్తి

కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

ర్యాండమైజేషన్ ప్రక్రియలో కలెక్టర్

సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఓట్ల లెక్కింపునకు సిబ్బంది ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తెలిపారు. జూన్ 4న నిర్వహించనున్న ఓట్ల లెక్కింపునకు కౌంటింగ్ సూపర్‌వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లు, మైక్రో అబ్జర్వర్లకు ర్యాండమైజేషన్ ప్రక్రియను శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏలూరు జిల్లాలో ఏలూరు పార్లమెంటు, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు జూన్ 4న ఓట్ల లెక్కింపు నిర్వహిస్తామన్నారు. కౌంటింగ్ ప్రక్రియకు 289 మంది కౌంటింగ్ సూపర్ వైజర్లు, 340 మంది కౌంటింగ్ అసిస్టెంట్లు, 309 మంది మైక్రో అబ్జర్వర్లు మొత్తంగా 938 మంది కౌంటింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ పారదర్శకంగా ఎన్ఐసి సాఫ్ట్‌వేర్ ఆన్‌లైన్లో పూర్తిచేశామని తెలిపారు. ర్యాండమైజేషన్ ప్రక్రియలో జిల్లా రెవిన్యూ అధికారి డి. పుష్పమణి, కలెక్టరేట్ ఎఒ కె.కాశీవిశ్వేశ్వరరావు, ఎన్ఐసి డిఐఒ శర్మ తదితరులు పాల్గొన్నారు.

వీధి వ్యాపారులపై దౌర్జన్యాలు, వేధింపులు అరికట్టాలి

వీధి వ్యాపారుల సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు బి.సోమయ్య

ప్రజాశక్తి - ఏలూరు

వీధి వ్యాపారులపై ఏలూరు నగరపాలక సంస్థ అధికారులు, సిఆర్ రెడ్డి కాలేజీ యాజమాన్యం దౌర్జన్యాలు, వేధింపులు అరికట్టాలని వీధి వ్యాపారుల సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు బి.సోమయ్య డిమాండ్ చేశారు. సిఆర్.రెడ్డి కాలేజీ గోడను ఆనుకుని టిటిడి కళ్యాణ మండపం ఎదురుగా ఫుట్ పాత్‌కి ఆనుకుని వ్యాపారాలు చేసుకుంటున్న 40 మంది చిరు వ్యాపారులపై నగరపాలక సంస్థ అధికారులు, సిఆర్.రెడ్డి కాలేజీ యాజమాన్యం దౌర్జన్యంగా దాడులు చేసి షాపులు, తోపుడు బండ్లు తొలగించడం అన్యాయమన్నారు. సిఆర్.రెడ్డి కాలేజీ ప్రాంతం చట్ట ప్రకారం రెడ్ జోన్ కాదని, గ్రీన్ జోన్, ఎల్లో జోన్లలో ఉందని, వీధి వ్యాపారుల చట్ట ప్రకారం గ్రీన్ జోన్, ఎల్లో జోన్లలో ఉన్న షాపులపై మున్సిపల్ అధికారులు, పోలీసు అధికారులు ఎలాంటి దౌర్జన్యాలు దాడులు చేయడానికి వీలులేదని, వారిని తొలగించడానికి వీల్లేదని ఆయన తెలిపారు. నగరపాలక సంస్థ అధికారులు రూ.పది నుంచి రూ.రెండు, మూడు వేల వరకు ఆశీలు, పన్నులు కట్టించుకుంటూ ఈ విధంగా దౌర్జన్యం చేసి షాపులను తొలగించడం దుర్మార్గమన్నారు. చిరు వ్యాపారుల షాపులు తొలగించిన చోటనే మళ్లీ షాపులు పెట్టుకునేందుకు అవకాశం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. లేకపోతే వీధి వ్యాపారుల సంక్షేమ సంఘం తరపున పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని ఆయన హెచ్చరించారు.

ప్రశాంతంగా ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

జిల్లా పరీక్షల కన్వీనర్ బి.ప్రభాకరరావు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం జిల్లా వ్యాప్తంగా ప్రశాంతంగా జరిగినట్లు జిల్లా పరీక్షల కన్వీనర్ బి.ప్రభాకరరావు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 27 పరీక్ష కేంద్రాల్లో ఉదయం తొమ్మిది గంటల నుంచి 12 గంటల వరకు జరిగిన మొదటి సంవత్సరం తెలుగు, సంస్కృతం, హిందీ, ఉర్దూ పరీక్షలకు మొత్తం 1,719 మందికి 1,556 మంది హాజరు కాగా 163 మంది గైర్హాజరయ్యారు. 91 శాతం హాజరు నమోదైంది. ఇందులో సాధారణ విద్యార్థులు 1,537 మందికి 1,397 మంది హాజరు కాగా 140 మంది గైర్హాజరయ్యారు. వృత్తి విద్య విభాగంలో 182 మందికి 159 మంది హాజరు కాగా 23 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం రెండున్నర గంటల నుంచి ఐదున్నర గంటల వరకు జరిగిన ద్వితీయ సంవత్సరం తెలుగు, హిందీ, సంస్కృతం, ఉర్దూ పరీక్షలకు మొత్తం 480 మందికి 410 మంది హాజరు కాగా 70 మంది గైర్హాజరయ్యారు. 85 శాతం హాజరు నమోదైంది. ఇందులో సాధారణ విద్యార్థులు 259 మందికి 218 మంది హాజరు కాగా 41 మంది గైర్హాజరయ్యారు. వృత్తి విద్యా విభాగంలో 221 మందికి 192 మంది హాజరు కాగా 29 మంది గైర్హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదని, పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని ప్రభాకరరావు తెలిపారు.

కాలువ రేవులో చెత్త తొలగింపు

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - ఉంగుటూరు

కైకరంలో ఏలూరు కాలువ గట్టు, రేవుల వద్ద పేరుకుపోయిన చెత్త చెదారాన్ని అధికారులు పంచాయతీ పారిశుధ్య కార్మికులతో తీయించి ట్రాక్టర్‌పై దూరంగా తరలించారు. అనంతరం బ్లీచింగ్, ముగ్గు చల్లించారు. కైకరంలో కానరాని స్వచ్ఛభారత్ శీర్షికతో గురువారం ప్రజాశక్తిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. పంచాయతీ విస్తరణాధికారి షేక్ షంషుద్దీన్ ఆదేశాలతో కైకరం సెక్రటరీ నాగేంద్ర పారిశుధ్య చర్యలు చేపట్టారు. వచ్చేది వర్షాకాలం కావడంతో గ్రామంలో చెత్త లేకుండా పారిశుధ్య నిర్వహణ పనులు చేయిస్తామని అధికారులు తెలిపారు.

త్వరలో రెడ్‌క్రాస్ వీల్‌చైర్లు పంపిణీ

ఛైర్మన్ బివి.కృష్ణారెడ్డి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలో ఉన్న జిల్లా రెడ్ క్రాస్ కార్యాలయంలో శుక్రవారం ఛైర్మన్ బివి.కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో మేనేజింగ్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు, చలివేంద్రాలు ఏర్పాటు చేశామని, అగ్ని ప్రమాదాల వల్ల ఇల్లు దగ్ధమైన బాధితులకు ఆయా ప్రాంతాలకు చెందిన తహశీల్దార్ల సిఫార్సులతో వంట పాత్రలతో కూడిన కిచెన్ సెట్‌లను, హైజీన్ కిట్లను, దుప్పట్లు, టార్పాలిన్లను పంపిణీ చేస్తున్నామన్నారు. త్వరలో కలెక్టర్ ప్రసన్నకుమార్ ఆధ్వర్యంలో జిల్లాలోని ముఖ్య పట్టణాల్లో రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, అవసరమైన వృద్ధాశ్రమాలకు, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రాథమిక వైద్య కేంద్రాలకు రెడ్‌క్రాస్ వీల్ చైర్లను పంపిణీ చేయనున్నట్లు కృష్ణారెడ్డి తెలిపారు. ఈ కమిటీ సమావేశంలో రెడ్ క్రాస్ కార్యదర్శి కెబి.సీతారాం, డాక్టర్ జి.స్పందన, గౌరవ ట్రెజరర్ రేవూరి శివప్రసాద్, కమిటీ సభ్యులు టి.రామారావు, బిఆర్ సిహెచ్ నారాయణ, ఆర్ఎస్ఆర్ బుజ్జి పాల్గొన్నారు.

దాడి చేసి డబ్బులు లాక్కున్నారు..!

పోలీసులు కేసు నమోదు చేయడం లేదు : దళితుడి ఆవేదన

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల రూరల్

తనపై నల్లజర్ల మండలం అయ్యవరం గ్రామానికి నలుగురు వ్యక్తులు దాడి చేశారని మండలంలోని కొమ్మర గ్రామానికి చెందిన దళితుడు ముంగమూరి లక్ష్మణరావు చెప్పాడు. ఈ మేరకు ఆయన తెలిపిన వివరాల ప్రకారం... ఈ నెల 21వ తేదీ మంగళవారం సాయంత్రం బైక్‌పై నల్లజర్ల మండలం దూబచర్ల గ్రామం వెళ్లానని, తిరిగి కొమ్మర బయలుదేరానని చెప్పాడు. ఈ క్రమంలో రాళ్లకుంట వద్దకు వచ్చేసరికి నల్లజర్ల మండలం అయ్యవరం గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు తనపై దాడి చేసి కులం పేరుతో దూషించి తన వద్ద ఉన్న రూ.40 వేలు లాక్కున్నారని చెప్పాడు. తాను ప్రాణ భయంతో గ్రామంలోకి పరుగులు తీయగా స్థానికులు భీమడోలు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారని తెలిపాడు. ఘటన జరిగి సుమారు నాలుగు రోజులవుతున్నా ఇప్పటి వరకు పోలీసులు కేసు నమోదు చేయకుండా తనను పోలీస్ స్టేషన్ చుట్టూ తిప్పుతున్నారన్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని లక్ష్మణరావు కోరుతున్నాడు.

ఈ విద్యా సంవత్సరం నుంచి ఇంగ్లీష్ మీడియం

చాట్రాయి జెడ్‌పిహెచ్ పాఠశాల హెచ్ఎం కృష్ణయ్య

ప్రజాశక్తి - చాట్రాయి

మండల కేంద్రమైన చాట్రాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ విద్యా సంవత్సరం నుంచి ఇంగ్లీష్ మీడియం ప్రారంభించినట్లు ప్రధానోపాధ్యాయులు డి.కృష్ణయ్య తెలిపారు. ఈ సందర్భంగా ప్రజాశక్తితో మాట్లాడారు. 1985లో పాఠశాల ప్రారంభించినట్లు ఆయన చెప్పారు. ఈ పాఠశాల విస్సన్నపేట వెళ్లే ప్రధాన రహదారి పక్కన ఉన్న ఇంట్లో కొనసాగిందన్నారు. 2000 సంవత్సరంలో ప్రభుత్వం పాఠశాలకు స్థలాన్ని కేటాయించి భవనాలు నిర్మించిందని తెలిపారు. 2023-24 విద్యా సంవత్సరంలో పాఠశాలలో మొత్తం 118 మంది విద్యార్థులు ఉన్నారని, వారిలో 29 మంది పదో తరగతి విద్యార్థులున్నారని తెలిపారు. పదో తరగతి పరీక్షల్లో 29 మందిలో 28 మంది ఉత్తీర్ణత సాధించారని చెప్పారు. నూజివీడు డివిజన్ పరిధిలో 96.5 శాతం ఉత్తీర్ణత వచ్చిందన్నారు. ఈ విద్యాసంవత్సరం 2024-2025 నుంచి ఇంగ్లీష్ మీడియం ప్రారంభిస్తున్నామని తెలిపారు. పదో తరగతి విద్యార్థులకు సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తామని తెలిపారు. పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం తరగతి గదుల్లో ఫ్యాన్లు, బల్లలు ఏర్పాటు చేశామన్నారు. పాఠశాలలో మొత్తం తొమ్మిది మంది ఉపాధ్యాయులు పని చేస్తున్నారని, రికార్డ్ అసిస్టెంట్ ఒకరు, జూనియర్ అసిస్టెంట్ ఒకరు పని చేస్తున్నారని తెలిపారు. ఫిజికల్ డైరెక్టర్ పోస్ట్ ఖాళీగా ఉందన్నారు. పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్ వలసపల్లి వెంకటరమణ తమ ఉపాధ్యాయులకు, విద్యార్థులకు సహాయ సహకారాలు అందిస్తున్నారని, ప్రతి ఏడాది పాఠశాల వార్షికోత్సవం నిర్వహిస్తున్నామని తెలిపారు.

బాధితునికి జనసేన ఆర్థిక సాయం

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

మండలంలోని అంకాలగూడెం గ్రామానికి చెందిన చిడిపి చిన్న వెంకటేశ్వరరావు కాలికి గత నెల ఏప్రిల్ 30వ తేదీన గాయామైంది. కొయ్యలగూడెం పట్టణంలో నిర్వహించిన జనసేన పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ సభలో చిన్నవెంకటేశ్వరరావుకు కాలికి గాయమైంది. దీంతో ఆయన ఇంటి వద్దనే ఉంటూ చికిత్స పొందుతున్నాడు. ఈ క్రమంలో ఆయనకు జనసేన కొయ్యలగూడెం మండలాధ్యక్షులు తోట వీర వెంకట సత్యనారాయణ, టిడిపి నాయకులు ముప్పనపల్లి వెంకటేశ్వరరావుల చేతులమీదుగా రూ.20 వేల నగదు అందించారు. ఈ కార్యక్రమంలో నక్క బాబి, నీలం నాగేశ్వరరావు, చిరంజీవి, టిడిపి, జనసేన పార్టీల నాయకులు పాల్గొన్నారు.

కామవరపుకోటలో గిరిప్రసాద్ వర్ధంతి సభ

ప్రజాశక్తి - కామవరపుకోట

తెలంగాణ సాయుధ పోరాట యోధుడు సిపిఐ అగ్రనేత నల్లమల్ల గిరిప్రసాద్‌కు సిపిఐ కామవరపుకోట మండల కార్యదర్శి టివిఎస్.రాజు నివాళు లర్పించారు. కామవరపుకోటలో శ్రీప్రభు స్వామి సిమెంట్ తూరల కంపెనీ వద్ద వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గదుల సత్యనారాయణ అధ్యక్షతన శుక్రవారం గిరిప్రసాద్ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతిథిగా హాజరైన టివిఎస్.రాజు మాట్లాడుతూ తెలంగాణలోని సింగరేణి బొగ్గు గనుల కార్మికుల హక్కుల కోసం సుదీర్ఘకాలం పోరాటం చేసిన మహనీయుడు గిరిప్రసాద్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల నాయకులు చలమాల శ్రీనివాసరావు, జి.సత్యనారాయణ, ఎఐటియుసి, ఎఆర్.పాలెం భూ పోరాట సమితి నాయకులు శెట్టి నాగ బాలాజీ, నల్లమోతుల శ్రీనివాసరావు, కె.మాధవరావు, రైస్ మిల్ వర్కర్స్ యూనియన్ నాయకులు బివి.రాఘవులు పాల్గొన్నారు.

పాతనూతనగూడెంలో భారీ అన్నసమారాధన

పోలవరం : మండలంలోని పోలవరం పంచాయతీ పాతనూతనగూడెంలో కొత్త రామాలయం వద్ద శ్రీరామనవమి ఉత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం భారీ అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, నిర్వాహకులు మాట్లాడుతూ సుమారు 2000 మంది ఈ అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారని తెలిపారు.

నేరాలు - ఘోరాలు

ధాన్యం డబ్బులు ఇవ్వడంలేదని రైతుల ఫిర్యాదు

ప్రజాశక్తి - ముసునూరు

ధాన్యం వ్యాపారం చేసిన వ్యాపారులు తమకు డబ్బు ఇవ్వకుండా ఎగ్గొట్టారని రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నూజివీడు రూరల్ మండల పరిధిలోని అన్నవరం గ్రామానికి చెందిన ధాన్యం వ్యాపారులు సురేష్, చంద్రశేఖర్ అలియాస్ శేఖర్‌లు తమ వద్ద ధాన్యం కొనుగోలు చేసి సుమారు రూ.నాలుగు కోట్లు ఇవ్వకుండా పలు ఇబ్బందులకు గురిచేస్తున్నారని రైతులు వాపోయారు. నూజివీడు రూరల్ పోలీస్ స్టేషన్‌లో 150 మందికి పైగా రైతులు ఫిర్యాదు చేశారు. పోలీసు అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆగి ఉన్న వాటర్‌ట్యాంకర్‌ను ఢీకొన్న బైక్

వరి కోత మిషన్ డ్రైవర్ మృతి

ప్రజాశక్తి - పోలవరం

బైక్ అదుపుతప్పి ఆగి ఉన్న వాటర్‌ట్యాంకర్‌ను ఢీకొనడంతో బైక్ నడుపుతున్న వరి కోత మిషన్ డ్రైవర్ మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని ఎల్ఎన్‌డి పేట గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలవరం రూరల్ మండల ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని ఎల్ఎన్‌డి పేట గ్రామానికి చెందిన కాసాని కరుణ (34) శుక్రవారం ఉదయం బయన్నర గంటలకు తన ఇంటి వద్ద నుంచి బైక్‌పై సెంటర్‌కి బయలుదేరాడు. ఈ క్రమంలో స్థానిక సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం వీధిలో ఆగి ఉన్న వాటర్ ట్యాంకర్‌ను ఢీకొనడంతో కరుణకు తీవ్ర గాయాలయ్యాయి. ఇది గమనించిన స్థానికులు అతడిని ఎల్ఎన్‌డి పేట ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రానికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం అక్కడి నుంచి పోలవరం ప్రభుత్వ సామాజిక వైద్య ఆరోగ్య కేంద్రానికి 108 వాహనంలో తరలించారు. అప్పటికే కరుణ మృతి చెందారని వైద్యులు ధ్రువీకరించారు. మృతుని బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్లు చెప్పారు. మృతునికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - కామవరపుకోట

బైక్‌పై అతివేగంగా వచ్చి పాల వ్యాన్‌ను వెనుక నుంచి బలంగా ఢీకొట్టడంతో తలకు గాయాలై వ్యక్తి మృతి చెందిన ఘటన గండిగూడెం గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... లింగపాలెం మండలం సింగగూడెం గ్రామానికి చెందిన ఉమ్మడి దుర్గారావు (42) గురువారం రాత్రి సుమారు పది గంటల సమయంలో ద్వారకాతిరుమల మండలం వేంపాడు గ్రామం నుంచి బైక్ వస్తూ కామవరపుకోట మండలం కళ్లచెరువు పంచాయతీ శివారు గండిగూడెం గ్రామం వద్ద ఆగి ఉన్న పాల వ్యాన్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన దుర్గారావు అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తడికలపూడి ఎస్ఐ జయబాబు తెలిపారు.

వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు చోరీ

ప్రజాశక్తి - కామవరపుకోట

ఆడమిల్లి గ్రామంలోని చిన్నమూర్తిపాలెంలో ఓ వృద్ధురాలి మెడలో సుమారు రూ.3లక్షల విలువైన నాలుగున్నర కాసుల బంగారు తాడును ఇద్దరు దొంగలు అపహరించారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... చిన్నమూర్తిపాలెంకి చెందిన వృద్ధురాలు తుంటముక్క శుక్రవారం మధ్యాహ్నం తన ఇంటి ముందు కూర్చొని ఉండగా బైక్‌పై వచ్చిన ఇద్దరు యువకులు తాగడానికి నీళ్లు కావాలని అడిగారు. ఆమె నీరు తెచ్చేందుకు లోపలకు వెళ్తుండగా వచ్చిన ఆమె మెడలో నుంచి బంగారం గొలుసు లాగేసి బైక్‌పై పరారయ్యారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జయబాబు తెలిపారు.

ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

'ఉషోదయ'లో తక్కువ ఫీజుతో కార్పొరేట్ విద్య

సంస్థ ఫౌండర్, డైరెక్టర్ గుణ్ణం బుల్లెబ్బాయ్

ప్రజాశక్తి - ఉంగుటూరు


బుల్లెబ్బాయ్, గీతావాణి దంపతులు

తక్కువ ఫీజులతో కార్పొరేట్ స్థాయి విద్య అందించడమే తమ పాఠశాల లక్ష్యమని ఉషోదయ హై స్కూల్ వ్యవస్థాపకులు, ప్రిన్సిపల్ గుణ్ణం బుల్లెబ్బాయి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో అందరికీ తక్కువ ఫీజులతో నాణ్యమైన విద్య అందించడానికి 1991లో నారాయణపురం గ్రామంలో ఉషోదయ ఎడ్యుకేషనల్ సొసైటీని స్థాపించామన్నారు. సంస్థను తొలుత ప్రైమరీ విద్యతో ప్రారంభించారని తెలిపారు. ప్రైమరీ విద్యతో ఆరంభించి అంచలంచెలుగా హైస్కూల్ స్థాయికి ఎదిగిందన్నారు. సమీప గ్రామాలు, ఇతర మండలాల నుంచి విద్యార్థులను ఆకర్షించి మెరుగైన విద్యను అందిస్తూ అందరి అభిమానాన్ని చురగొన్నామని ఆయన తెలిపారు. సువిశాలమైన సొంత భవనాలు, విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించేందుకు అతి పెద్ద ఆటస్థలం, సమీప గ్రామాల నుంచి విద్యార్థులను పాఠశాలకు చేర్చేందుకు సొంత బస్సు సౌకర్యం కల్పించినట్లు చెప్పారు. క్రీడలు, సంగీతం, డ్యాన్స్, భగవద్గీత, కరాటేలో శిక్షణ ఇస్తున్నామన్నారు. పదో తరగతి విద్యార్థులపై వ్యక్తిగత శ్రద్ధ తీసుకుని సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. చదువుతో పాటు సమాజ సేవలపై విద్యార్థులకు ప్రత్యేక కార్యక్రమాలు హైస్కూల్ ప్రారంభించిన నాటి నుంచి నేటి వరకూ నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి సంవత్సరం పదో తరగతి విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత, మండల స్థాయిలో మొదటి, రెండో స్థానం సాధిస్తున్నారన్నారు. ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో ఉషోదయ విద్యార్థులు విజయదుందుభి మోగించారని తెలిపారు. మండలంలో అడపా నవ్యశ్రీ 581 మార్కులతో ప్రథమ స్థానం సాధించిందని చెప్పారు. మొత్తం 34 మంది విద్యార్థులకు 33 మంది ప్రథమ శ్రేణిలో, ఒకరు ద్వితీయ శ్రేణిలో విజయం సాధించారని, వారి విజయానికి స్కూలు డైరెక్టర్ గుణ్ణం గీతావాణీ సారథ్యంలో ఉపాధ్యాయుల కృషి ఎంతో ఉందన్నారు. తమ స్కూల్‌లో చదివిన పూర్వ విద్యార్థులు నేడు పారిశ్రామిక వేత్తలు, వైద్యులు, బ్యాంకర్లు, ప్రభుత్వ ఉద్యోగులుగా నిలవడం చాలా సంతృప్తి ఇస్తుందని గుణ్ణం బుల్లెబ్బాయ్, గీతావాణి దంపతులు తెలిపారు.

స్కూల్ టాపర్ నవ్యశ్రీ

ఉషోదయ స్కూల్ భవనం

అందరికీ నాణ్యమైన విద్యే 'శ్రీవెంకటేశ్వర' లక్ష్యం

ఎడ్యుకేషనల్ సొసైటీ డైరెక్టర్లు సత్యనారాయణ, నాగేశ్వరరావు, శ్రీధర్

శ్రీవెంకటేశ్వర ఎడ్యుకేషన్ సొసైటీ


సింగిరెడ్డి


నాగేశ్వరరావు


శ్రీధర్

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

అతి తక్కువ ఫీజులతో కార్పొరేట్ స్థాయి విద్య అందించడమే శ్రీవెంకటేశ్వర ఎడ్యుకేషనల్ సొసైటీ లక్ష్యమని డైరెక్టర్లు, సింగిరెడ్డి సత్యనారాయణ, కానూరి నాగేశ్వరరావు, గర్రి శ్రీధర్ తెలిపారు. ఈ సందర్భంగా వారు ప్రజాశక్తితో మాట్లాడారు. అందరికీ నాణ్యమైన విద్య అందించడమే ధ్యేయంగా తాము ముగ్గురం కలిసి శ్రీ వెంకటేశ్వర ఎడ్యుకేషనల్ సొసైటీని 2013లో స్థాపించామని తెలిపారు. ప్రతి పేద విద్యార్థికీ తక్కువ ఫీజుతో కార్పొరేట్ స్థాయి విద్యను అందించడానికి తమ వంతు కృషి చేస్తున్నామన్నారు. ఈ సొసైటీని స్థాపించడానికి ముందు తాము ముగ్గురం విజయవాడ, గుంటూరు, మచిలీపట్నం, విశాఖపట్నంలో పలు విద్యాసంస్థల్లో టీచింగ్ రంగంలో 25 సంవత్సరాల అనుభవం గడించామన్నారు. ఆ తర్వాతే ప్రతి పేద విద్యార్థికి సైతం కార్పొరేట్ స్థాయి విద్యను అందించడమే లక్ష్యంగా పూనుకుని జంగారెడ్డిగూడెం పట్టణాన్ని తమ ఎడ్యుకేషన్ సొసైటీగా ఎంచుకుని విద్యాసంస్థ ప్రారంభించినట్లు చెప్పారు. మా ముగ్గురి సారథ్యంలో జంగారెడ్డిగూడెం పట్టణ సమీప గ్రామాల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆకర్షితులై పట్టణంలో నెంబర్‌వన్ విద్యాసంస్థగా అభివృద్ధి చెందిందన్నారు. విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించేందుకు అతిపెద్ద ఆట స్థలం, గ్రామాల నుంచి విద్యార్థులను పాఠశాలకు చేర్చేందుకు బస్సు సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. విద్యార్థులకు విద్యతతో పాటు క్రీడలు, సంగీతం, డ్యాన్స్‌లలో శిక్షణ ఇస్తున్నామన్నారు. పదో తరగతి, ఇంటర్ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి, వ్యక్తిగత శ్రద్ధ తీసుకొని ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. శ్రీవెంకటేశ్వర ఎడ్యుకేషనల్ సొసైటీ స్థాపించిన దగ్గర నుంచి పదో తరగతి, ఇంటర్‌లో నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధిస్తుందన్నారు. మండల స్థాయిలో మొదటి స్థానంలో నిలిచిందని చెప్పారు. ఈ ఏడాది పదో తరగతి, ఇంటర్ విద్యార్థులు విజయదుందుభి మోగించారన్నారు. పదో తరగతిలో 596 మార్కులతో 12 మంది విద్యార్థులు విజయం సాధించారన్నారు. విద్యార్థులందరూ ప్రథమ, ద్వితీయ స్థానాల్లో విజయం సాధించారన్నారు. 90 మందికి పైగా 500కు పైగా మార్కులు సాధించారన్నారు. ఇంటర్ విద్యార్థులు నూటికి నూరు శాతం విజయం సాధించిన సంస్థగా నిలిచిందన్నారు. తమ స్కూల్, కాలేజీలో కాంపిటేటివ్ పరీక్షల నిమిత్తం డబల్ ఐటి, ఎన్ఐటి, ట్రిపుల్ ఐటి, సియు, జిఎఫ్‌టి, జెఎన్‌టియులలో శిక్షణ ఇస్తూ ప్రతి ఏడాది 60 నుంచి 70 సీట్లు వరకు సాధించామన్నారు. 2023 విద్యా సంవత్సరంలో డబల్ ఐటిలో ఆలిండియా మూడో ర్యాంకు తమ విద్యాసంస్థ విద్యార్థిని ఎస్.నాగదీప్తి సాధించిందని, ఈ ఏడాది ట్రిపుల్ ఐటిలో ఆలిండియా 13వ ర్యాంకు తమ విద్యా సంస్థ విద్యార్థిని పి.పూర్ణసంహిత సాధించిందని తెలిపారు. పేద విద్యార్థులకు అతి తక్కువ ఫీజుతో కార్పొరేట్ విద్యను అందిస్తున్నామన్నారు. ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ విద్యార్థులకు ప్రయోగశాలలు ఉన్నాయని తెలిపారు. కోవిడ్ సమయంలో తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలకు ఉచితంగా కార్పొరేట్ విద్యను అందించామన్నారు. 2017లో మహిళా జూనియర్ కళాశాల స్థాపించామని తెలిపారు. తమ విద్యార్థులు డబల్ ఐటిలో, ట్రిపుల్ ఐటిలో మంచి ప్రతిభ కనపరుస్తూ మంచి ర్యాంకులతో విజయదుందుభి మోగిస్తున్నారని తెలిపారు.

పూర్ణసంహిత

ప్రకృతి వైపరీత్యాలు, అగ్ని ప్రమాద సమయంలో ఆస్తి, ప్రాణ నష్టాల నివారణ చర్యలపై అవగాహన కల్పించాలి

రాష్ట్ర విపత్తుల స్పందన, అగ్నిమాపక శాఖ కార్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్

ప్రజాశక్తి - ఏలూరు

ప్రకృతి వైపరీత్యాలు, అగ్ని ప్రమాద సమయంలో ఆస్తి, ప్రాణ నష్టాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రజల్లో మరింత అవగాహన పెంచేలా కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ అన్నారు. స్థానిక ఫైర్‌స్టేషన్ సెంటర్‌లోని రాష్ట్ర విపత్తుల స్పందన, అగ్నిమాపక శాఖ కార్యాలయాన్ని శుక్రవారం కలెక్టర్ సందర్శించి అగ్నిమాపక వాహనాలు, వాటర్ బోట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ జిల్లాలో ప్రకృతి వైపరీత్యాలు, అగ్నిప్రమాద సమయాల్లో అగ్నిమాపక సిబ్బంది అందించే సేవలు ఎనలేనివన్నారు. వేసవిలో ఎక్కడైనా అగ్నిప్రమాదం సంభవిస్తే వెంటనే స్పందించి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు తీసుకుం టున్నారన్నారు. ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు, దానిని నివారించడం కంటే ముందు జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పిం చాలని ఆయన సూచించారు. రానున్న వర్షాకాలంలో ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రజలను కాపాడేందుకు అవసరమైన వాహనాలు, బోట్లను సిద్ధం చేసుకోవాలన్నారు. జిల్లాలో కుక్కునూరు, వేలేరుపాడు, పోలవరం మండలాల్లో వరదల సమయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల స్పందన, అగ్నిమాపక శాఖ సిబ్బంది గొప్ప సేవలందించారని, వారి సేవల వల్ల ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టాలు జరగకుండా నివారించగలిగా మన్నారు. జిల్లా ఫైర్ ఆఫీసర్ సిహెచ్.రత్నబాబు మాట్లాడుతూ జిల్లాలో ఆరు రాష్ట్ర విపత్తుల స్పందన, అగ్నిమాపక శాఖల కార్యాలయాలు ఉన్నాయని, వాటిలో ఎనిమిది అగ్నిమాపక నివారణ వాహనాలు ఉన్నాయని తెలిపారు. అత్యవసర పరిస్థితిలో వినియోగానికి యంత్రపరికరాలు, వాటర్ బోట్లు అందుబాటులో ఉన్నాయ న్నారు. అగ్నిప్రమాదాలు, ప్రకృతి వైపరీత్యాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలపై జిల్లాలోని పరిశ్రమలు, ప్రజా నివాస ప్రాంతాల్లో డెమో ప్రదర్శనలు ఇచ్చినట్లు తెలిపారు.

అగ్నిమాపక శాఖ కార్యాలయాన్ని సందర్శిస్తున్న కలెక్టర్

పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండల వ్యాప్తంగా పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభమ య్యాయి. మండలంలోని బర్రింకలపాడు గిరిజన గురుకుల పాఠశాలలో పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేయగా మొదటి రోజు తెలుగు పరీక్షకు మొత్తం 89 మంది విద్యార్థు లకు 31 మంది హాజరవ్వగా, 58 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఇఒ కె.శ్రీనివాస్ తెలిపారు. పరీక్ష కేంద్రం వద్ద ఎటువంటి మాస్ కాపీయింగ్ జరగకుండా పటిష్ఠ భద్రత ఏర్పాటు చేసినట్లు పాఠశాల ప్రిన్సిపల్ బి.పెద్దిరాజు తెలిపారు.

జంగారెడ్డిగూడెం టౌన్ : పదో తరగతి సప్లిమెంటరీ పరీక్ష శుక్రవారం ప్రశాంతంగా జరిగింది. 144 సెక్షన్ అమలులో ఉండడంతో అవాంఛనీయ సంఘటన జరగకుండా తెలుగు పరీక్ష ప్రశాంతంగా జరిగింది.

టి.నరసాపురం : పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా శుక్రవారం నిర్వహించిన తెలుగు పరీక్షకు 47 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఇఒ టి.రామ్మూర్తి తెలిపారు. మండల కేంద్రమైన టి.నరసాపురం హైస్కూలులో నిర్వహించిన పరీక్షలకు మండలంలోని కేతవరం, బొర్రంపాలెం, మక్కినవారిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల నుంచి విద్యార్థులు తెలుగు పరీక్షకు 70 మంది హాజరు కావాల్సి ఉండగా 23 మంది విద్యార్థులు మాత్రమే హాజరయ్యారు. 47 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఆయన తెలిపారు. మొదటి రోజు తెలుగు పరీక్ష ప్రశాంత వాతావరణంలో నిర్వహించినట్లు ఆయన తెలిపారు.

భీమడోలు : భీమడోలు మండలంలో పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. పరీక్షల నిర్వహణకు భీమడోలు హై స్కూల్‌తో పాటు, పొలసానిపల్లి బాలయోగి గురుకులం (బాలికలు) పాఠశాలలను కేంద్రాలుగా ఎంపిక చేశారు. శుక్రవారం నిర్వహించిన తెలుగు పరీక్షలకు భీమడోలు కేంద్రానికి కేటాయించిన 90 మందిలో 38 మంది హాజరయ్యారు. పొలసానిపల్లి గురుకులం కేంద్రానికి కేటాయించిన 69 మందిలో 20 మంది హాజరయ్యారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు ఎంఇఒ శ్రీనివాసరావు తెలిపారు.

ప్రశాంతంగా ఇంటర్ సప్లిమెంటరీ పరీక్ష

పోలవరం : పోలవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా జరిగాయి. ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు ముగ్గురు హాజరు కావాల్సి ఉండగా ముగ్గురు హాజరయ్యారని, ఈ ఏడాది ఇంటర్ ఫలితాలు, ఉత్తీర్ణత శాతం మెరుగ్గా ఉందని ప్రిన్సిపల్ శ్రీనివాసరావు తెలిపారు.

'జెడ్‌పి ప్రావిడెంట్ ఫండ్ బ్యాలెన్స్ షీట్లు విడుదల చేయాలి'

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

జిల్లా పరిషత్ ప్రావిడెంట్ ఫండ్ బ్యాలెన్స్ షీట్లు వెంటనే విడుదల చేయాలని పిఆర్‌టియు జిల్లా అధ్యక్షులు పువ్వుల ఆంజనేయులు జెడ్‌పి సిఇఒ కెఎస్ఎస్.సుబ్బారావును కోరారు. జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో ముఖ్య కార్యనిర్వహణాధికారి కెఎస్ఎస్. సుబ్బారావును కలిసి గత నాలుగు ఆర్థిక సంవత్సరాలుగా ప్రావిడెంట్ ఫండ్ బ్యాలెన్స్ షీట్లు విడుదల చేయక పోవడానికి గల ఇబ్బందులను ఆంజనేయులు అడిగి తెలుసుకున్నారు. జాప్యానికి కారణాలు ఏమైనప్పటికీ సుమారు 7,700 మంది పిఎఫ్ ఖాతాదారులైన ఉద్యోగ, ఉపాధ్యాయులు వారి ఖాతాల్లో దాచుకున్న సొమ్ము వివరాలు తెలియక ఆందోళన చెందుతున్నారని, తక్షణం బ్యాలెన్స్ షీట్లు విడుదల చేయాలని కోరారు. పొరపాటున ఏదైనా నెలలో ప్రీమియం అమౌంట్ ఖాతాలో జమకాక పోవడం, గత డిఎ బకాయిలు జమ కాకపోవడం వంటి సమస్యలు సరి చేసుకునే అవకాశం లేకుండా పోయిందన్నారు. ఉద్యోగ విరమణ పొందుతున్న వారు కూడా మరింత ఇబ్బంది పడుతున్నారని, బ్యాలెన్స్ షీట్స్ కోసం కార్యాలయం చుట్టూ తిరగాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. దీనికి స్పందించిన సిఇఒ మాట్లాడుతూ తాను బాధ్యతలు తీసుకున్న తర్వాత నుంచి ఇదే విషయమై తగిన కసరత్తు కొనసాగిస్తున్నానని, ఇదే ప్రథమ ప్రాధాన్యతగా భావించి తగిన చర్యలు తీసుకుంటున్నానని, త్వరలోనే బ్యాలెన్స్ షీట్లు విడుదల చేయిస్తానని హామీ ఇచ్చారు.

పలుచోట్ల కార్డెన్ సెర్చ్

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

నగరంలో మరోసారి పెద్ద ఎత్తున ఏలూరు ఒకటో పట్టణ పరిధిలోని పలు ప్రాంతాల్లో కార్డెన్ సెర్చ్ నిర్వహించి దాదాపు 70 ద్విచక్ర వాహనాలు, మూడు ఆటోలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అదనపు ఎస్‌పి స్వరూపరాణి తెలిపిన వివరాల ప్రకారం...ఏలూరు ఒకటో పట్టణ పరిధిలోని రూరల్ ప్రాంతమైన వైఎస్ఆర్ కాలనీ ప్రాంతంలో శుక్రవారం తెల్లవారుజామున పోలీసు బలగాలు ఎస్‌పి మేరీ ప్రశాంతి ఆదేశాలతో అదనపు ఎస్‌పి స్వరూపరాణి ఆధ్వర్యంలో ఏలూరు డిఎస్‌పి శ్రీనివాసులు సారథ్యంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. వైఎస్ఆర్ కాలనీలో సరైన ధ్రువపత్రాలు లేని 70 ద్విచక్ర వాహనాలను, మూడు ఆటోలను స్వాధీనం చేసుకున్నారు.

ముసునూరు : గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపడుతున్నట్లు ముసునూరు ఎస్ఐ పి.వాసు చెప్పారు. మండలంలోని ముసునూరు, చింతలవల్లి గ్రామాల్లో కార్డెన్ సెర్చ్ కార్యక్రమంలో భాగంగా ఎస్ఐ తమ సిబ్బందితో గతంలో అక్రమ మద్యం అమ్ముతున్న వారి ఇళ్లను తనిఖీ చేశారు.

ఆరోగ్య పరిరక్షణపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - భీమడోలు

కిశోర బాలికలు ఆరోగ్య పరిరక్షణ పట్ల అవగాహన కలిగి ఉండాలని ఐసిడిఎస్ భీమడోలు ప్రాజెక్ట్ సిడిపిఒ విఎస్.విజయలక్ష్మి కోరారు. ఐసిడిఎస్ ఆధ్వర్యంలో కిశోర బాలికలకు మాసిక మహోత్సవ కార్యక్రమాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. దీనిలో భాగంగా కిశోర బాలికలకు సెక్టార్ సూపర్‌వైజర్ నూర్జహాన్ ఆధ్వర్యంలో అంబరుపేట గ్రామ పంచాయతీ పరిధిలో అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సిడిపిఒ మాట్లాడుతూ కిశోర బాలికలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, పోషకాహారం విలువల గురించి తెలుసుకోవాలని చెప్పారు.

ద్వారకాతిరుమల : మండలంలోని పంగిడిగూడెంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో మాసిక మహోత్సవం కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. రుతుక్రమం సమయంలో వాడే ఉత్పత్తులు పారవేసే పద్ధతులపై అవగాహన కల్పించారు.

ముసునూరు : సమాజంలో ప్రతిఒక్కరూ బాల్య వివాహాలపై అవగాహన కలిగి ఉండాలని అర్బన్ సెక్టార్ సూపర్‌వైజర్, అజరయ్యపేట అంగన్వాడీ సూపర్‌వైజర్ కె.ధనలక్ష్మి అన్నారు. నూజివీడు పట్టణ పరిధిలోని అజరయ్యపేటలో అంగన్వాడీ కేంద్రంలో ఆ పరిధిలోని బాలికలకు మాసిక మహోత్సవ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు.

జ్వర బాధిత కుటుంబాలను ఆదుకోవాలి : వ్యకాస

ప్రజాశక్తి - చాట్రాయి

మండలంలోని చిన్నంపేట గ్రామంలో గత రెండు నెలల నుంచి విష జ్వరాలతో ప్రజలు కొట్టుమిట్టాడుతున్నారని, వారి కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం చాట్రాయి మండల కార్యదర్శి కొమ్ము ఆనందం కోరారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ గత రెండు నెలల నుంచి ప్రజలకు జ్వరాలు, కాళ్ల వాపులు, కీళ్ల నొప్పులు, మొఖానికి మచ్చలు వచ్చి నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. విపరీతమైనటువంటి ఖర్చులు అవుతున్నాయని జ్వరాల వల్ల మంచానికే పరిమితమవుతున్నారని, జ్వరాలు తగ్గేవరకు బియ్యం, కందిపప్పు, పంచదార, నిత్యావసర సరుకులు ఉచితంగా పంపిణీ చేయాలని వారి కుటుంబాన్ని ఆదుకోవాలని ఉన్నతాధికారులను కోరారు. చిన్నంపేటలోని వాటర్ ప్లాంట్ల నీటిని, బోర్లలోని నీటిని ల్యాబ్‌కు పంపించి నీటి పరీక్షలు నిర్వహించాలని, కలుషితం లేని నీటిని ప్రజలకు అందించాలని కోరారు.

న్యాయవాదులకు అవగాహన

ప్రజాశక్తి - నూజివీడు

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మూడు కొత్త చట్టాలపై నూజివీడు బార్ అసోసియేషన్, అఖిల భారత న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో కోర్టు ఆవరణలోని బార్ అసోసియేషన్ హాలులో న్యాయవాదులకు శుక్రవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. పాత ఐపిసి సిఆర్‌పిసి, ఎవిడెన్స్ చట్టాల స్థానంలో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త చట్టాలు ఈ ఏడాది జులై ఒకటో తేదీ నుంచి అమల్లోకి రానున్న దృష్ట్యా ఈ అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య వక్తగా విజయవాడకు చెందిన సీనియర్ న్యాయవాది, ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ సభ్యులు, ఐలు జాతీయ కమిటీ అధ్యక్షులు సుంకర రాజేంద్ర ప్రసాద్ హాజరై మాట్లాడారు. ఈ చట్టాలు మనుగడలోకి వస్తే ముఖ్యంగా పేద, బలహీన, బడుగు తరగతుల వారు తీవ్ర ఇబ్బందుల్లో పడతారన్నారు. న్యాయవాదులు, న్యాయమూర్తులు, పోలీసు అధికారులందరూ ఈ కొత్త చట్టాలపై అవగాహన చేసుకోవాలన్నారు. సదస్సు అనంతరం బార్, ఐలు సభ్యులు రాజేంద్ర ప్రసాద్‌ని శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు.

'రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాలు సరికావు'

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఎన్నికల కోడ్ అమలవుతున్న సమయంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలపై కేంద్ర ప్రభుత్వం విచారణ జరిపించాలని కాపు సంక్షేమ సేవాసంఘం రాష్ట్ర అధ్యక్షులు పులి శ్రీరాములు అన్నారు. ఇటీవల కన్వర్డ్ ఐఎఎస్‌ల ఎంపికకు ఇంటర్వ్యూలు జరపడానికి ప్రయత్నించడం సహించరాని విషయమన్నారు. గత ఫిబ్రవరి నెలలో రహస్యంగా నోటిఫికేషన్ ఇవ్వటంతో కాపులు, బిసి, ఎస్‌సి, ఎస్‌టి మైనారిటీ తరగతుల అధికారులు నష్టపోయారన్నారు.

'గాజాలో మారణహోమానికి వ్యతిరేకంగా పోరాడాలి'

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

గాజాలో మారణహోమానికి వ్యతిరేకంగా గొంతెత్తుదామని భారత కార్మిక సంఘాల సమైక్య రాష్ట్ర అధ్యక్షులు పి.ప్రసాద్ పిలుపునిచ్చారు. ఏలూరు పట్టణంలో ఐఎఫ్‌టియు జిల్లా కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షులు భూషణం అధ్యక్షతన శుక్రవారం రాష్ట్ర సదస్సు నిర్వహించారు. ముఖ్య వక్తగా విచ్చేసిన పి.ప్రసాద్ మాట్లాడుతూ ఇజ్రాయిల్ పాలకులు పాలిస్తీనాను దురాక్రమిస్తున్నారన్నారు. పాలస్తీనా ప్రజల జాతి ఆకాంక్షలను అణచివేస్తున్నారని, దీని కోసం పాలస్తీనాపై బాంబు, వైమానిక దాడులు చేస్తూ మారణహోమాన్ని సృష్టిస్తున్నారని చెప్పారు. ఈ మారణహోమానికి వ్యతిరేకంగా పోరాడుతున్న పాలస్తీనా ప్రజలను దుర్మార్గంగా అణిచివేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టియు జిల్లా ఉపాధ్యక్షుడు రామ్మోహన్, పిడిఎస్‌యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.భాస్కర్, జిల్లా అధ్యక్షుడు కాకి నాని, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆది, రాష్ట్ర సహాయ కార్యదర్శి రాజేష్, రాష్ట్ర కమిటీ సభ్యులు రాంబాబు, నగర కార్యదర్శి క్రాంతి కుమార్ పాల్గొన్నారు.

పట్టిసీమ ఫెర్రీ రేవు వేలం పాట

ప్రజాశక్తి - పోలవరం

మండలంలోని పట్టిసీమ గ్రామ పంచాయతీలో సర్పంచి సబ్బారపు శ్రీరామచంద్రమూర్తి అధ్యక్షతన ఇఒపిఆర్‌డి ఆధ్వర్యంలో ఫెర్రీ రేవు వేలం పాట మూడోసారి నిర్వహించారు. సదరు వేలంపాటలో ముగ్గురు పోటీకి రాగా మైగాపుల సత్యనారాయణ, కాకుమళ్ల మణికంఠ సతీష్, దాకే అజయ్ బాబు పాటలో పాల్గొన్నారు. సదరు వేలంపాటలో మైగాపుల సత్యనారాయణ రూ.1.17 లక్షలతో హెచ్చు పాట పాడినట్లు పంచాయతీ సెక్రటరీ తాతి విజయకుమారి తెలిపారు.

PUBLIC NOTICE

Under the instructions of my client M/s.Shriram Finance Ltd. Aswaraopeta Branch Rep.by its Branch Manager it is stated that Bosetti Himanth Mithra, S/o.Laxmana Rao, 27 Yrs, R/o.H.No.3-96, Makkinavarigudem, T.Narsapuram Mandal, Eluru District is creating mortgage against his property shown below as security for the proposed trade loan. If any body having any objection, they can send the objections to me or to my client with in 3 days from the date of publication of this notice and further objections if any shall not bind my client.

SCHEDULE OF THE PROPERTY

RCC Building bearing H.No.3-96 along with its house site of an extent of 121 Sq.yards or 0.02 1/2 cents out of 0-13 cents in R.S.No.96-1 situated at Makkinavarigudem village and Panchayath, T.Narsapuram Mandal, Eluru District bounded by:
East: Place of Bosetti Charan Satya Sai Manikanta
South : Road
West: Place of Sivalayam
North : Place of Gudidala Venkulu

P.Ganesh Babu
Advocate, Kothagudem